క్లుప్తంగా

అంగన్‌వాడీ వర్కర్ల అరెస్టు


మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మద్దిపాడు: విజయవాడలో వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు పోలీసుల అనుమతులు లేకపోయినా వెళ్తున్నందున పొన్నలూరు సెక్టార్ అంగన్‌వాడీ వర్కర్లను మద్దిపాడులో ఏఎస్‌ఐ రమేష్ ఆధ్వర్యంలో సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరంతా తుఫాన్ వ్యాన్‌లో ప్రయాణిస్తుండగా గ్రోత్ సెంటర్ వద్ద అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకూ వారిని స్టేషన్‌లోనే ఉంచి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసి స్వస్థలాలకు పంపించారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


బాధిత కుటుంబాలకు సహాయం చేస్తున్న సర్పంచ్ అశోక్

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీకి అండగా ఉండే కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని వినోదరాయునిపాలెం గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్ అన్నారు. ఇటీవల గ్రామంలో అనారోగ్యంతో మరణించిన పార్టీ కార్యకర్తలు మిరియాల శ్రీనివాసరావు, మోకా నరసింహరావు కుటుంబాలకు అండగా నిలిచేందుకు వారి కుటుంబ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చెరో రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం సోమవారం వినోదరాయుని పాలెం గ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టు చైర్మన్ పురం ఆంజనేయులు, పార్టీ నాయకులు అప్పాడి పాలచంద్రరావు, పూరిపత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసరాలు అందిస్తున్న హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు

ఒంగోలు: స్థానిక ఉమామనోవికాస కేంద్రానికి హోప్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం నిత్యావసర సరుకులు అందించారు. నీళ్లు పట్టుకునే పైపులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఈశ్వర్, హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు తేళ్ల కిరణ్‌కుమార్, సిద్దిక్, రాజశేఖర్, యశ్వంత్, పరంజ్యోతి, రామకోటయ్య, అనీల్, శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

మంచి కార్యక్రమానికి అండగా ఉంటా

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి


ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ

ఒంగోలు: మంచి కార్యక్రమం ఏది నిర్వహించినా అందుకు తనవంతు సాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇటీవల లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో బాలినేని వెంకటేశ్వరరెడ్డి, రమాదేవి చారిటబుల్ ట్రస్టు సహకారంతో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బాలినేని ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆటల పోటీలు నిర్వహిస్తే ఆర్థిక సహకారం అందిస్తానని చెప్పినట్లు తెలిపారు. పోటీలు చక్కగా నిర్వహించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్‌కు అభినందనలు తెలిపారు. పురుషుల విభాగంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలతో పాటు షటిల్ డబుల్స్ నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి మెమెంటోలు, నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ, క్రీడల ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సోమినేని సురేష్ మాట్లాడుతూ క్రీడా పోటీల నిర్వహణకు ముందుకొచ్చి మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7,500, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ఇచ్చి ఎనలేని ప్రోత్సాహం అందించారంటూ బాలినేనిని దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కార్పొరేటర్ శాండిల్య, మాంటిస్సోరి ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన బాలినేని...

ఒంగోలు సబర్బన్: ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు కుమారుని వివాహ రిసెప్షన్‌కు హాజరైన వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి.. నూతన దంపతులను ఆశీర్వదించారు. స్థానిక ఓల్డ్ జెడ్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న బాలాజీ తిరుపతిరావు కల్యాణ మండపంలో సోమవారం బండి వెంకట పద్మకుమార్-సౌజన్య దంపతులకు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వదించారు. ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

24న అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి

- ముఖ్య అతిథులుగా హాజరుకానున్న బాలినేని, నందిగం, బూచేపల్లి

చీమకుర్తి: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య మెమోరియల్ ఆవరణలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఈ నెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఆవిష్కరించనున్నట్లు ఆ పార్టీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, పార్టీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సాయంత్రం చీమకుర్తిలోని బూచేపల్లి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను వారు వెల్లడించారు. బాలినేనితో పాటు బాపట్ల ఎంపీ నందిగం సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణతో పాటు అదే ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే వేమా యల్లయ్య వర్ధంతి కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మున్సిపల్ వ్యాయామ శాలను అతిథులు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు. మీడియా సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నలమల మాణిక్యం, కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పత్తి కోటేశ్వరరావు, మేకల యల్లయ్య, బీమన వెంకట్రావు, పాలడుగు సుబ్బారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌పై దాడి అమానుషం

- దాడిని ఖండించిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు
- చీమకుర్తిలో నిరసన


చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిపాడు: సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుపై అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్యని పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. చీమకుర్తిలో నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, మండల జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, మరికొందరు నాయకులు సోమవారం ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ఎమ్మెల్యేలు గూండాలు, వీధిరౌడీలలా అసెంబ్లీలో ప్రవర్తించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ వారి చర్యలను ఖండిస్తున్నామని వారు పేర్కొన్నారు. వారం రోజులుగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రతిపక్ష నాయకులు ప్రతిరోజూ స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు ప్రదర్శిస్తూ కాగితాలు చింపి బలహీనవర్గాలకు చెందిన స్పీకర్ తమ్మినేని సీతారామ్‌ను అవమానిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఎలీజాపై టీడీపీ నాయకులు దాడి చేస్తున్న క్రమంలో వారిని వారించడానికి వెళ్లిన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్‌పై ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెదాళం అశోక్ దాడిచేయడం హేయమైన చర్యని ఖండించారు. టీడీపీ ఎమ్మెల్యే అశోక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేపై దాడి హేయం...


పోలవరపు శ్రీమన్నారాయణ

నాగులుప్పలపాడు: ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో సభాపతిపై టీడీపీ ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాన్ని ప్రశ్నించిన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు గూండాల్లా ప్రవర్తిస్తూ దాడి చేయడం చాలా హేయమైన చర్యని వైఎస్సార్ సీపీ నాగులుప్పలపాడు మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ ఒక ప్రకటనలో ఖండించారు. దీనికి టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

టీడీపీ ఎమ్మెల్యేలది సిగ్గుమాలిన పని...


నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీపీ, నాగులుప్పలపాడు

దేవాలయం లాంటి అసెంబ్లీలో ప్రతిరోజూ అరాచకాలకు పాల్పడుతున్న టీడీపీ ఎమ్మెల్యేలది సిగ్గుమాలిన పని అని నాగులుప్పలపాడు ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. అరాచకాన్ని మౌనంగా భరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాంపై దాడిచేస్తున్న టీడీపీ ఎమ్మెల్యేలను అడ్డుకోబోయిన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్‌పై దాడికి తెగబడి గాయపరచడం అన్యాయమన్నారు. అరాచకాలకు పాల్పడుతున్న టీడీపీ ఎమ్మెల్యేలకు రాబోయే రోజుల్లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఎమ్మెల్యేపై జరిగిన దాడి చాలా బాధాకరని అన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైఎస్సార్ సీపీ నాయకుల నిరసన...

చీమకుర్తి: చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం సాయంత్రం నల్లబ్యాడ్జీలు ధరించి చీమకుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో స్పీకర్‌పై దాడిచేయడానికి ప్రయత్నించిన టీడీపీ ఎమ్మెల్యేలను అడ్డుకోవడానికి ప్రయత్నించిన సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు గూండాలుగా వ్యవహరించి దాడికి ప్రయత్నించడం దారుణమని వారు అన్నారు. ఈ దాడిలో ఎమ్మెల్యే చేతికి గాయాలవడంతో టీడీపీ ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నలమల మాణిక్యం, సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, బీమన వెంకట్రావు, పాటిబండ్ల గంగయ్య, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, బడే అయ్యపరెడ్డి, ఏ రామబ్రహ్మం, మేకల యల్లయ్య, పాలపర్తి వెంకట్రావు, శేషిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై విచారించిన ఎంపీడీవో


ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

మద్దిపాడు: ఫీల్డ్ అసిస్టెంట్లను ఇష్టానుసారం అసభ్యంగా ఏపీవో మాట్లాడుతున్నారంటూ డ్వామా పీడీ శీనారెడ్డికి ఫిర్యాదు అందిన నేపథ్యంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఫీల్డ్ అసిస్టెంట్లను సోమవారం తన కార్యాలయానికి పిలిపించి విచారించారు. ఏపీవోపై వారు పలు ఫిర్యాదులు చేశారు. ఇష్టానుసారం ఆడవారిని అనరాని మాటలు అంటున్నారని, అందువలన తాము పీడీ వద్దకు వెళ్లాల్సి వచ్చిందని ఎంపీడీవోకు వారు తెలిపారు. కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ ఫొటోలు మార్ఫింగ్ చేయడం వంటి పనులు చేస్తుండటంతో అతనిని సస్పెండ్ చేయాల్సిందిగా పీడీ ఆదేశించారని, ఆ మేరకు సస్పెండ్ చేస్తూ ఏపీవోను నాగులుప్పలపాడు బదిలీ చేస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఎవరైనా విధినిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే వారిని సరెండర్ చేస్తామని హెచ్చరించారు. ముందు నుంచే జాగ్రత్తగా విధులు నిర్వహించుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్‌కు సూచనలు చేశారు.

నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

- డీపీవో నారాయణరెడ్డి


డీపీవోకు ఇంటి పన్ను చెల్లిస్తున్న ఇనమనమెళ్లూరు సర్పంచ్ ఏడుకొండలు, ఎంపీపీ అరుణ

మద్దిపాడు: ప్రతి మండలంలో ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని డీపీవో నారాయణరెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఇంటి పన్నులు వసూలు చేయాలని, దీనిపై ప్రతి గ్రామ కార్యదర్శి దృష్టి పెట్టాలని ఆదేశించారు. గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి డీపీవో సమక్షంలో ఇంటి పన్ను చెల్లించారు. అనంతరం ఇనమనమెళ్లూరు సచివాలయం పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, అదేవిధంగా ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం చేపట్టాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధిపై ఎంపీపీతో చర్చించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, ఇన్‌చార్జి వీఆర్వో సుశీల్, పలువురు సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రజకుల సమస్యల పరిష్కారంపై సీఎంకు చిత్తశుద్ధి

- రజక సంఘ జిల్లా అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు

ఒంగోలు: 75 సంవత్సరాల రాష్ట్ర చరిత్రలో రజకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రజక సంఘ జిల్లా అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక ఒగ్గులకుంటలోని రజక సంఘ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రజకుల సమస్యలపై ఈ నెల 3న 14 డిమాండ్లను ప్రభుత్వానికి పంపామన్నారు. వాటిపై చర్చించేందుకు రజక సంఘ నాయకులను ప్రభుత్వం ఆహ్వానించినట్లు తెలిపారు. ఆదివారం వివిధ జిల్లాల రజక సంఘాల నాయకులను ఆహ్వానించి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, శరత్‌చంద్ర, ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, ఎండీ మల్లికార్జున చర్చించారన్నారు. అందులో 8 డిమాండ్లపై సానుకూలంగా స్పందించారని, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యంగా రజక మహిళలపై అత్యాచారాలు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టం, ఇస్త్రీ షాపులకే కాకుండా ఇళ్ల వద్ద ఇస్త్రీ చేసుకునేవారికి సైతం 150 యూనిట్ల ఉచిత విద్యుత్, 50 సంవత్సరాల వయసు దాటిన వారందరికీ పెన్షన్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, ట్రైనింగ్ కాలేజీలు, ఆలయాల్లో దోబీ పనిని రజకులకే కేటాయించడం వంటివి కోరామన్నారు. ఆలయాల్లో రజకులకు ఒక డైరెక్టర్ పోస్టు కేటాయించాలని, రజకులకు సంబంధించిన చెరువులు, కుంటలు ఆక్రమణకు గురికాకుండా రక్షణ కల్పించేలా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయిలో రజక దోబీఖానాల నిర్మాణం, మరమ్మతులకు రూ.40 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. తమకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోయినా పర్లేదని, రాష్ట్రంలోని 26 లక్షల మంది రజకులను ఆర్థికంగా ఆదుకోవాలని, వారి ఉన్నతికి అండగా నిలవాలని మాత్రమే కోరడం జరిగిందన్నారు. అందుకు ప్రభుత్వ ప్రతినిధులు కూడా సానుకూలంగా స్పందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో రజక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం సుబ్బన్న, నగర కార్యదర్శి పాదర్తి వెంకటేశ్వర్లు, న్యాయ సలహాదారు నగరికంటి శ్రీనివాసులు, సభ్యులు పాదర్తి ఆంజనేయులు, సీహెచ్ సింగయ్య, ఆర్ఎల్‌పీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సీఎంను కలిసిన ఎమ్మెల్సీ


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

ఒంగోలు: ఎమ్మెల్సీగా ఎన్నికైన చంద్రశేఖరరెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో భాగంగా రెండు సమస్యలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి పరిష్కరించినట్లు వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు కేశవరపు జాలిరెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికై ఇంకా ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టిన చంద్రశేఖరరెడ్డికి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ తరఫున అభినందనలు తెలిపారు. మొదటి వారంలోనే రెండుసార్లు సీఎంను కలిసి ఎన్నికల హామీల్లో ఇచ్చిన రెండు సమస్యలను పరిష్కరించారన్నారు. ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి, రామచంద్రారెడ్డితో కలిసి సీఎంను కలిసి ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం ప్రస్తుతం 60 రోజులు ఇస్తున్న చైల్డ్ కేర్ సెలవులను 180 రోజులకు పెంచినట్లు తెలిపారు. ఈ సెలవులను పిల్లల వయసు 18 సంవత్సరాల్లోపు మాత్రమే వాడుకోవాల్సి ఉంటుందన్నారు. తాజాగా 180 రోజులకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ అయ్యేలోపు ఎప్పుడైనా వాడుకునే సౌలభ్యాన్ని కల్పించాలని సీఎంను కోరగా, అందుకు సీఎం సానుకూలంగా స్పందించి జీవో జారీకి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. ఇక, ప్రైవేటు పాఠశాలల గుర్తింపు వ్యవధి ప్రస్తుతం మూడు సంవత్సరాలు మాత్రమే ఉండగా, దానిని 8 సంవత్సరాలకు పెంచేందుకు సీఎం అంగీకరించి వెంటనే జీవో జారీచేయాలని ఆదేశించారని తెలిపారు. వీటికి సంబంధించిన జీవోలు ఒకటిరెండు రోజుల్లోనే వెలువడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

దంత వ్యాధులపై అవగాహన అవసరం

ఒంగోలు అర్బన్: దంత వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక జీజీహెచ్ డెంటల్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ నామినేని కిరణ్ అన్నారు. సోమవారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ వద్ద దంత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ సహజంగా దంతాల సంరక్షణకు సంబంధించి కొద్దిపాటి నిర్లక్ష్యం ఉంటుందని, అందుకే దంత సంబంధ వ్యాధులు వస్తుంటాయని అన్నారు. దంత సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే దంత వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఎటువంటి ఆహారం తీసుకున్నా, కాఫీ, టీ, జ్యూస్‌ల వంటివి తాగినా వెంటనే నోటిలో నీళ్లు పోసుకుని పుక్కిలించాలన్నారు. ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేయాలని, అదికూడా మెత్తటి బ్రష్ వినియోగించాలని సూచించారు. బ్రష్ చేసే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. ఇటువంటి చిన్నపాటి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే దంత సమస్యలు రావన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు దంత సంరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్ఎంపీ సంఘ నాయకులు హనుమారెడ్డి, బట్టు బాలాజీ, భాస్కర్‌రావు, మాలకొండయ్య, శాంతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అవగాహన కల్పించిన డాక్టర్‌ను సత్కరించారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ఒంగోలు సబర్బన్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. సోమవారం ఆయన చాంబర్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి రెండు అర్జీలు, శానిటేషన్ విభాగానికి సంబంధించి నాలుగు అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం కలెక్టర్‌చే వీక్షణ పద్ధతిలో నిర్వహించబడుతున్న స్పందన కార్యక్రమానికి కూడా కమిషనర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఒంగోలు నగర ప్రజలు ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి వారి సమస్యలపై స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కే వెంకటేశ్వర్లు, డీఈ కే మాల్యాద్రి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం బాగుంది

- కొత్తపట్నం మండలంలోని పలు పంచాయతీల్లో పర్యటించిన జర్మనీ టీం

కొత్తపట్నం: గ్రామీణ ప్రాంత రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ఎంతో బాగుందని జర్మనీ టీం సభ్యులు అభినందించారు. మండలంలోని పలు పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తున్న పొలాలను సోమవారం వారు సందర్శించారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ వారి ఆధ్వర్యంలో ముందుగా గాదెపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న శనగ పంటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయానికి, రసాయన వ్యవసాయానికి మధ్య తేడాను గమనించారు. రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో 9 సార్వత్రిక సూత్రాల డెమోను జర్మనీ టీంకు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి వివరించారు. అనంతరం పాదర్తి గ్రామంలో ప్రవేశించి దద్దాల రామారావు ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. అగ్నిస్త్రం, బీజామృతం, ఘనజీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికలు డెమో చేసి చూపించారు. కొత్తపట్నంలో అగ్రికల్చర్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న వేరుశనగ పైరును పరిశీలించారు. అనంతరం శివసాయి గ్రామ సంఘంలో మహిళా సంఘ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జర్మనీ టీం మాట్లాడుతూ తాము పరిశీలించిన ప్రకృతి వ్యవసాయం సాగులో కొత్తపట్నం రైతులు ఎంతో శ్రద్ధతో చేస్తున్నారని అభినందించారు. డ్వాక్రా గ్రూపు సభ్యుల్లో కూడా ప్రకృతి వ్యవసాయంపై ఎంతో చైతన్యం ఉందని కొనియాడారు. నూరు శాతం ప్రకృతి వ్యవసాయం సాగుకు ప్రయత్నం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసులు, జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, రెడ్డిప్ప, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రాంతాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జర్మనీ టీం

రాష్ట్రస్థాయి పోటీలకు పేర్నమిట్ట విద్యార్థి సైన్స్ ప్రాజెక్ట్


సైన్స్ టీచర్ మూర్తితో విద్యార్థిని దుర్గ

చీమకుర్తి: పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని రావూరి దుర్గ సైన్స్ టీచర్ మూర్తి గైడెన్స్‌లో తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శన ఒంగోలులో జరగ్గా, అందులో దుర్గ ప్రదర్శించిన 'ఉమన్ సేఫ్టీ అండ్ ట్రాకింగ్ సిస్టం యూజింగ్ జీఎస్ఎం అండ్ జీపీఎస్' ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. సైన్స్ టీచర్ మూర్తి, విద్యార్థిని దుర్గను పాఠశాల టీచర్లు సోమవారం శాలువాతో సత్కరించి అభినందించారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ


వెంకటేశ్వరమ్మకు బీమా నగదు అందిస్తున్న గిరీష్‌బాబు

వజ్జిరెడ్డిపాలెం (కొత్తపట్నం): మండలంలోని వజ్జిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పెళ్లేటి సూర్యనారాయణరెడ్డి (40) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో నమోదవడంతో తయన భార్య పెళ్లేటి వెంకటేశ్వరమ్మకు వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. మట్టి ఖర్చుల నిమిత్తం సోమవారం వెల్ఫేర్ అసిస్టెంట్ వి.గిరీష్‌బాబు రూ.10 వేలను వెంకటేశ్వరమ్మకు అందజేశారు. మిగతా మొత్తాన్ని ఆమె అకౌంట్‌లో జమ చేస్తామని ఆయన చెప్పారు.

రేపు కొప్పోలు ఆలయంలో పంచాంగ శ్రవణం

ఒంగోలు: శ్రీశోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కొప్పోలులోని శ్రీ చెన్నకేశవ, ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం 7 గంటలకు పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్చకుడు పి.సమీర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు చెన్నకేశవస్వామికి 7 కేజీల చందనంతో చందన అలంకారం జరుగుతుందని, అనంతరం తులసి దళార్చన ఉంటుందని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.